క్లుప్తంగా

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న ఓ.టి.మూకన్న (65) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఈయన గతేడాది నుంచి చికిత్స పొందుతున్నారని, కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి.. రూ.15 వేలను డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ జయరామిరెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. వీఆర్వో రమేష్, వీఆర్‌ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండలాధ్యక్షుడు వెంకటేశులు, కార్యదర్శులు సిద్ధప్ప, నాగరాజు సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో చోటు

ఆదోనిరూరల్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కర్నూలు జిల్లా కమిటీలో ఆదోని నియోజకవర్గానికి చోటు లభించింది. సోమవారం విడుదల చేసిన నియమకాల్లో.. ఆదోని నుంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్లుపోతుల సురేష్‌ను ఎంపిక చేశారు. ఈయన ప్రస్తుతం ఆదోని ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు దినేష్ బాబు, తాయప్ప, జాయింట్ సెక్రటరీలుగా నరేష్‌కుమార్, గోవిందరాజును ఎంపిక చేశారు.

ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు


స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం గ్యారతారిఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

వేతనాలు పెంచాలి

ఆదోనిరూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలను పెంచాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. పట్టణంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, జానకి, సీఐటీయూ సీనియర్ నాయకులు పి.ఈరన్న మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

వాజ్‌పేయి జయంతి

ఆదోనిఅర్బన్: భారత మాజీ ప్రధాని, భారతరత్న గ్రహీత అటల్‌బిహారీ వాజ్‌పేయ్ 99వ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని కిలిచినపేట, హనుమాన్‌నగర్, గణేష్ సర్కిల్, ఆర్ట్స్ కళాశాల ప్రాంతం, క్రాంతినగర్‌లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు జిందే సాయికుమార్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, ఆదూరి విజయ్‌కృష్ణ మాట్లాడుతూ అటల్‌బిహారీ వాజ్‌పేయ్ సేవలను కొనియాడారు. నాయులు రమాకాంత్, మలేకర్ శ్రీనివాస్, లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో సోమవారం ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తున్న రామాంజనేయులును అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడి ఎంపిక

కోసిగి: ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా స్థానిక జీబీఎం స్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న రాజమౌళిని రెండవ సారిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదోనిలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు సమక్షంలో ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రెండవ సారిగా ఎంపిక కావడంపై మండల సభ్యులు ఖలీల అహ్మద్, ఓబులేష్, మహ్మద్ ఉసేన్, బీమా రెడ్డి, నారాయణ అభినందించారు.

వరిగడ్డికి డిమాండ్


ఎడ్లబండిలో వరిగడ్డిని తరలిస్తున్న రైతు

మద్దికెర: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పశువులకు గడ్డి కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వరిగడ్డి కొనుక్కొని తెచ్చుకుంటున్నారు. వరిగడ్డి ఒక బండి ధర రూ.6 వేలు, ట్రాక్టర్ రూ.10 వేల నుంచి రూ.12 వేల దాకా పలుకుతోంది. కర్ణాటక, అనంతపురం జిల్లాల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని రైతులు తెలిపారు. వేరుశనగ పంట ఆశించిన మేర లేకపోవడంతో జీవాలకు గ్రాసం లేకుండా పోయిందన్నారు.



కిరాణా దుకాణం నిర్వహిస్తున్న మహిళ పేరు పూర్ణిమ. ఈమే ఆదోనిలోని ఉప్పర వీధి ఇందిరానగర్‌లో నివాసముంటుంది.' వైఎస్సార్ ఆసరా పథకం కింద యేటా రూ.23 వేలు చొప్పున మూడేళ్లల్లో రూ.70 వేలు రుణమాఫీ పొందా. ప్రభుత్వం మాఫీ చేసిన డబ్బులతో కిరాణాషాపు పెట్టుకున్నా. భర్త, అత్తమామ, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నా. అద్దె ఇంట్లో ఉంటున్న మాకు కిరాణాషాపు జీవనాధారం. ప్రభుత్వం అందించిన సాయంతో ఐదేళ్లుగా వ్యాపారం చేస్తున్నాం. మహిళలకు ప్రభుత్వం చేస్తున్న సాయం మరువలేనిది'ని సంతోషం వ్యక్తం చేస్తుంది.



ఈమె పేరు మంగళి తిరుమలేశ్వరి. ఇందిరానగర్‌లో బీడీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తుంది. ' 20 యేళ్లుగా బీడీ కొట్టుతో బతుకుతున్నాం. నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు బార్బర్ షాపును నిర్వహిస్తున్నాడు. చిన్నబ్బాయి దివ్యాంగుడు. మాణిక్యం డ్వాక్రా గ్రూపులో పదేళ్ల నుంచి సభ్యురాలిగా కొనసాగుతున్నా. యేటా వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.17 వేలు వస్తున్నాయి. ఆ సొమ్ముతో దుకాణం నడుపుతున్నాను. ఇంటి పోషణకు దాని ఆదాయం సరిపోతుంది. మూడేళ్లల్లో రూ.51 వేలు వచ్చింది. వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు వరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

మహిళలకు 'ఆసరా'

- ఇచ్చిన హామీ మేరకు పొదుపు మహిళల రుణాల రద్దు
- ఆదోని నియోజకవర్గంలో 2,781 గ్రూపులు, 26,800 మంది సభ్యులు
- మూడు విడతల్లో రూ.81.23 కోట్లు విడుదల
- ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న మహిళలు
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

ఆదోనిటౌన్: వైఎస్సార్ ఆసరా పథకం పొదుపు సంఘాల మహిళలకు వరంగా మారింది. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 11-04-2019 వరకు పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని అమలు చేసి మహిళలు రుణాలకు సంబంధించిన మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆ సొమ్ముతో జీవనాధారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఒక్కో గ్రూపునకు ఏడాదికి రూ.1.45 లక్షల మాఫీ

వైఎస్సార్ ఆసరా పథకం కింద యేడాదికి ఒక్కో పొదుపు గ్రూపునకు రూ.1.45 లక్షలకు పైగానే పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఒక్కొక్క సభ్యురాలికి రూ.15 వేలు చొప్పున లబ్ధి పొందింది. మూడేళ్లలో మూడు దఫాలుగా ఒక్కొక్క మహిళ రూ.45 వేల నుంచి రూ.50 వేల దాకా రుణమాఫీ అందింది. నాలుగోసారి వచ్చే ఏడాది జనవరిలో రుణమాఫీ సొమ్ము మంజూరు కానుంది.

ఆదోని నియోజకవర్గంలో..

ఆదోని మున్సిపాలిటీ, మండలంలో 2,781 పొదుపు గ్రూపులు ఉన్నాయి. వీటిల్లో 26,800 మంది సభ్యులున్నారు. ఆయా సంఘాలకు గానూ మూడేళ్లలో రూ.81.23 కోట్లు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఈ పథకాన్ని 2020 సెప్టెంబర్ 20న అమలులోకి తీసుకొచ్చారు. వైఎస్సార్ ఆసరా పథకంతో వేలాది మంది పొదుపు సంఘాల మహిళల జీవనాలను మెరుగుపరచుకొని, ఆర్థికంగా స్థిరపడ్డారు.



బొరుగుల వ్యాపారం చేస్తున్న ఈమె పేరు తాజ్‌బీ. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముంటోంది. పట్టణంలోని తిరుమలనగర్, కాలేజీ ఏరియా, అలసందగుత్తి, బసరకోడు, దిబ్బనకల్, సాదాపురం ప్రాంతాల్లో బొరుగుల వ్యాపారం చేస్తుంది. 'రోజుకు వంద సేర్లు అమ్ముతున్నా. వచ్చిన సొమ్ముతో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు, అత్తమామలు జీవనం సాగిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా పథకం కింద యేటా రూ.22 వేలు వచ్చాయి. మూడేళ్లకు రూ.66 వేలు తీసుకున్నా'. జగనన్న రుణం మరువలేనిదని చెబుతోంది.


బసరకోడులో పొదుపు సంఘాల మహిళలతో సమీక్షిస్తున్న అధికారులు (ఫైల్)

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు
- వేడుకలకు ముస్తాబయిన చర్చిలు


కపటిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మత పెద్దలు

కోసిగి: మండలంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం, క్రీస్తుసంఘం, సీఎస్‌ఐ, ఏసుకృపా ప్రార్థన మందిర చర్చిల్లో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్లు రాజారత్నం, దేవరాజు, ప్రేమ్‌కుమార్,దేవపుత్ర క్రీస్తు బోధనలను వినిపించారు. కొల్మాన్‌పేట గ్రామంలోని చర్చిలలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళమోహన్ రెడ్డి కేక్ కట్ చేసి పంచిపెట్టి క్రిస్మస్ శుభకాంక్షలు తెలిపారు.

ఆదోనిరూరల్: మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. అర్ధరాత్రి నుంచి ఏసుప్రభువు ప్రతిమను గ్రామాల్లోని వీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మతపెద్దలు ప్రభువు సందేశాన్ని వినిపించారు.

ఆదోనిసెంట్రల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదోని పట్టణంలోని పలు చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువు ఫాదర్ కోలా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సర్వ మానవాళిని పాపం నుంచి విముక్తి కలిగించడానికి మానవుడిగా అవతరించారని తెలిపారు. శాంతి సమాధానం కలిగి ప్రతిఒక్కరూ జీవించాలని సూచించారు. సాటి మనిషి పట్ల ప్రేమ అభిమానం కలిగి జీవించాలన్నారు. పట్టణంలోని సీఎస్‌ఐ, హోలీటీ చర్చిల ఫాదర్‌లు భాస్కర్, బాబు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. సీయోనూ ప్రార్థనా మందిరంలో పాస్టర్లు ప్రత్యేక వర్తమానం అందించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి వివిధ ప్రార్థనాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కౌతాళం: క్రిస్మస్ వేడుకలు సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రి నుంచే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కౌతాళంలో నందకుమార్, సతీష్, ఎరిగేరిలో ప్రసాద్, వివిధ గ్రామాల చర్చిల పాస్టర్లు ఏసు మార్గాన్ని వివరించారు. సాయంత్రం ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుడికంబాలి గ్రామంలోని నిర్మిస్తున్న నూతన చర్చికు రూ.25వేల అందజేసినట్లు సర్పంచ్ సిద్దేశ్ తెలిపారు.


మాట్లాడుతున్న విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్‌లు కోలా విజయ్‌కుమార్, గురురెడ్డి విన్నారెడ్డి

రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేత

ఆదోనిఅర్బన్: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని యేరూషలేము ప్రార్థనా మందిరం పాస్టర్ విక్టర్ పాల్‌ఫిలిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు సోమవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. యోనా, సుగుణరావు, రత్నయ్య, రాజు, ఉదయ్, పద్మ, మున్నా పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

మంత్రాలయం : మండల కేంద్రంలో ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని క్రిష్టియన్లు క్రిస్మస్ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీఎస్‌ఐ, ఆర్‌సీఎం, క్రీస్తు సంఘం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్లు ఏసుక్రీస్తు జీవితచరిత్రను వివరించారు. అలాగే ఆయన చూపిన దారిలో నడవాలని సూచించారు.

పెద్దకడబూరు : ప్రతి ఒక్కరూ యేసు బోధించిన శాంతి మార్గంలో నడవాలని సీఎస్‌ఐ చర్చ్ పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్దకడబూరులో తెల్లవారు జాము నుంచి పురవీధుల్లో భక్తి గీతాలు ఆలపిస్తూ ఇంటింటికీ తిరిగారు.


క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్


పెద్దకడబూరు సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న మహిళలు


కౌతాళం సీఎస్‌ఐ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు


చర్చి నిర్మాణానికి విరాళమిస్తున్న సర్పంచ్ సిద్దేశ్


రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న పాస్టర్ విక్టర్ పాల్‌ఫిలిప్


ఆకట్టుకుంటున్న క్రీస్తు జననాన్ని తెలిపే నమూనా


భక్తులకు ద్రాక్షరసం పంపిణీ చేస్తున్న పాస్టర్


పెద్దకడబూరులో సీఎస్‌ఐ చర్చిలో సందేశం వినిపిస్తున్న పాస్టర్ రెవరెండ్ ముత్త

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

కౌతాళం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. క్రీడా కోసం అంత సిద్ధం చేశామన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మరో 7 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌతాళం, బాపురం,ఎరిగేరి, ఉరుకుంద, బదినేహాల్, కామవరం, నదిచాగి, హాల్వి గ్రామాల్లో మైదానాలను తీర్చి దిద్దామన్నారు. మంగళవారం క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు, 27న వాలీబాల్, 28న కబడ్డీ, ఖోఖో పోటీలు ఉంటాయని చెప్పారు. నమోదు చేసుకున్న వారందరూ పాల్గొనాలని కోరారు.

ఆదోనిసెంట్రల్: స్థానిక మున్సిపల్ పాఠశాల మైదానంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ఆడుదాం-ఆంధ్ర పోటీలను ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సోమవారనం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు. క్రీడా పోటీలకు నమోదు చేసుకున్న క్రీడాకారులంతా పాల్గొన్నాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

ఆదోనిటౌన్: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శిల్ప సౌభ్యానగర్, న్యూచైతన్య కాలనీల్లో ఆయన పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మురుగు కాలువల నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం కాలనీ, పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల పనులు పూర్తయ్యాయని, త్వరలోనే సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తామన్నారు.


మొక్క నాటుతున్న దృశ్యం

ఈ సందర్భంగా కొందరు మహిళలు మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరాగా ఎమ్మెల్యే మాట్లాడి త్వరలోనే బోరు వేయిస్తామని చెప్పారు.

నేడు మునిరంగస్వామి రథోత్సవం

తుగ్గలి: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న లింగనేనిదొడ్డి మునిరంగ స్వామి తిరునాల ఉత్సవాలను ఆలయ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండురోజులుగా మునిరంగస్వామి, తిమ్మగురుడులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కొండపై భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల పక్కీరప్పతాత ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా రథోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ తెలిపారు.


పూజలందుకుంటున్న మునిరంగస్వామి

కురువల ఐక్యవేదిక విజయవంతంపై హర్షం


నినాదాలు చేస్తున్న కురువ నాయకులు

ఆలూరు: కురువ కులస్తుల హక్కుల సాధన ఐక్య వేదికకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వారి రుణం తీర్చుకోలేనిదని సభ నిర్వాహకులు బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, కృష్ణమోహన్, ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయరాం తదితరులు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం వారు మాట్లాడుతూ.. కురువల మహాసభ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. సభ నిర్వహణలో సహకారం అందించిన రెవెన్యూ, పోలీసు ఇతర శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కురువ కులస్తుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కురువ నాయకలు దేవేంద్ర, శ్రీధర్, రంగయ్య, రాజ్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఎల్లెల్సీకి నీరు బంద్


హొళగుంద సెక్షన్‌లోని దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో తగ్గిన నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు విడుదల అవుతున్న నీటిని సోమవారం టీబీ బోర్డు అధికారులు నిలిపివేశారు. గంటకు వంద క్యూసెక్కులు చొప్పున తగ్గిస్తూ సాయంత్రానికి పూర్తిగ నిలిపివేశారు. జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీ పరిధిలో ఆంధ్ర కాలువ ప్రారంభం (హన్వాళ్ సెక్షన్) 250 కి.మీ వద్ద ఇంకా ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలతో తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరుతుండడంతో దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద రైతులు రెండు కార్ల పంటలు పండించారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఎల్లెల్సీ కింద ఒక కారు పంటకు (ఖరీఫ్) మాత్రమే నీరు సరిపోయాయి. ప్రస్తుతం టీబీ డ్యాంలో 10.5 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో వాటిని వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోనున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో జీరో ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 80 టీఎంసీల నీటి నిల్వ ఉండేది.

28న గూళ్యంలో పూల రథోత్సవం


స్వామివారి పూల రథం (ఫైల్)

హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం గూళ్యం గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీన గాదిలింగప్ప తాత 20వ పూల రథోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, గ్రామపెద్దలు సోమవారం విలేకరులకు తెలిపారు. పూల రథోత్సవం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అలాగే తాత వారి రథాన్ని సుందరంగా అలంకరించారు. వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఆలయంలో అన్నదానం, మంచినీరు, వసతి తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

పెరిగిన బియ్యం ధర

- క్వింటల్ సోనా మసూరి బియ్యం రూ. 5,200
- ఎల్లెల్సీ కింద రబీ సాగు లేకపోవడంతో ధరపై ప్రభావం


రైస్ మిల్లులో ఆడించిన బియ్యం

హొళగుంద: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి తగ్గడం, ఎల్లెల్సీ కింద రబీకి సాగు నీరు అందకపోవడంతో బియ్యం ధరలు పెరిగాయి. టీబీ డ్యాంపై ఆధారపడిన బళ్లారి, అనంతపురం, కర్నూలు జిల్లాలో ఈ ఏడాది రబీ పంట లేకపోవడంతో ధాన్యానికి డిమాండ్ పెరిగింది. ఇంతకుముందు సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్ కేవలం రూ.1,800 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.2,800 నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ప్రతి సంవత్సరం రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి వ్యాపారస్తుల వెంట పడేవారు కాగా ఈ ఏడాది ఆ పరిస్థితి తారుమారైంది.

మెరుస్తున్న బియ్యం..

డిమాండ్‌కు తగ్గ ధాన్యం లేకపోవడంతో గత నెల రోజులుగా బియ్యం ధరకు రెక్కలొచ్చాయి. కొత్త బియ్యం ధర ఇంతకుముందు క్వింటాల్ రూ.3,600 వరకు ఉండేది. అయితే నేడు రూ.5,200 వరకు పెరిగింది. వర్షాభావం కారణంగా మెట్ట భూముల్లో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు కాలువ కింద సాగు చేసుకున్న ధాన్యాన్ని మిల్లులో బియ్యం ఆడించి అమ్ముకుని కొంతమేర గట్టెక్కారు. కాలువ కింద భూములు లేని రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా సోనా మసూరి రకం సాగు చేసిన రైతులకు దిగుబడి పరవాలేదనుకున్నా ఆరనర్ రకం పంట మాత్రం ఎకరాకు 45 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా 20 బస్తాలు కూడా రాలేదు. అయితే ధాన్యం ధర రూ.3,200 వరకు ఉండడంతో పెట్టిన పెట్టుబడుల మేర వచ్చినట్లయ్యింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం
97054 44304 (ఆదోని)
70750 09147 (మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com